క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మెట్రోమాల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గగన్‌పహాడ్ గ్రామం, మెట్రోమాల్, ఆంధ్ర లిక్కర్, గగన్‌పహాడ్ ఇండస్ట్రియల్, శివాలయం లేన్, ఫిలికాన్ రబ్బర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 5 గంటల వరకు ఫిలికాన్ రబ్బర్, కరాచీ బేకరీ, ఇండస్ట్రీయల్ లేన్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

పర్యావరణ ప్రాధాన్యతను గుర్తించాలి



ప్రభుత్వ ప్రధాన సలహాదారు డా.రాజీవ్‌శర్మ, ప్రముఖులు

సాక్షి, సిటీబ్యూరో: పరిశ్రమలకు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత ప్రధానంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారు డాక్టర్ రాజీవ్‌శర్మ స్పష్టం చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ (ఐఎంటీ), గేర్ ఇండియా ఆధ్వర్యంలో నెట్ జీరో సమ్మిట్–2023 శనివారం రాజేంద్రనగర్‌లోని ఐఎంటీ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉక్కు, సిమెంట్, రవాణా, విద్యుత్ రంగాల్లో డీకార్బనైజేషన్ కార్యక్రమాలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం వ్యూహాలను పరస్పరం పంచుకోవడంలో భాగంగా ఆరోగ్య సంరక్షణ, ఔషధాల తయారీ, లాజిస్టిక్స్, రిటైల్ వరకు విభిన్న మార్పుల దిశగా ప్యానెల్ చర్చలు సాగాయి. డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, ఎక్సైడ్ ఎనర్జీ, ఐటీసీ లిమిటెడ్, గ్రీన్‌కో, ఇన్ఫోసిస్‌ల ప్రతినిధులు, ప్రముఖ వక్తలు హాజరయ్యారు.

కార్మిక సమస్యలను పరిష్కరించాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం ఎదుట ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. శనివారం జరిగిన ఈ సమ్మెకు మద్దతుగా జిల్లా బీఎస్పీ పార్టీ వెస్ట్‌జోన్ అధ్యక్షుడు రాచమల్ల జైసింహా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్మికులు అడుగుతున్న న్యాయమైన కోరకలు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. వేతనాల పెంపు, ఇన్సూరెన్స్ భద్రత కార్డులు ఇవ్వాలన్నారు.

బంగారం పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జెడ్డా నుంచి ఇండిగో వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అతడు ధరించిన షూలేస్‌లలో ఉన్న 326 గ్రాముల బంగారం బయటపడింది. ఈ బంగారం విలువ దాదాపు రూ.19.62 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అసైన్డ్ భూమిలో రోడ్డు.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్: అసైన్డ్ భూమిలో అక్రమంగా రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంఘీగూడ రెవెన్యూలో సర్వే నంబరు 117/2లో అక్రమంగా రోడ్డు వేసినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆర్‌ఐ సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాలిక ఆత్మహత్య

చదువుకు ఆర్థిక ఇబ్బందులే కారణం

అత్తాపూర్: ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆర్థిక సమస్యలు అడ్డురావడంతో ఓ బాలిక ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులియాదగిరి, ఏఎస్సై మహ్మద్ హర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. సులేమాన్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న అసద్ తన భార్య, పిల్లలను వదిలి వేరే కాపురం పెట్టాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అసద్ భార్య షబానాఖాన్ తన ముగ్గురు కూతుళ్లతో కలిసి విడిగా ఉంటోంది. ఇటీవల పదోతరగతి పూర్తి చేసిన సాధియాఫాతిమా(15) తల్లితో కలిసి ఉంటోంది. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, తరచూ ఇంట్లో జరుగుతున్న గొడవలతో మనస్తాపానికి గురైన సదరు బాలిక శనివారం సాయంత్రం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనార్టీ సంక్షేమానికి చేయూత

జిల్లా వ్యాప్తంగా మైనార్టీలకు రూ. 5.84 కోట్ల చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు

శంషాబాద్: మైనార్టీల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోందని మంత్రి పి. సబితారెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా వ్యాప్తంగా మైనార్టీలకు వందశాతం సబ్సిడీతో ఒక్కొక్కరికీ లక్షరూపాయల ఆర్థిక చేయూతలో భాగంగా మొత్తం రూ.5.84 కోట్ల చెక్కులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తాతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి గతంలో ఏ ప్రభుత్వాలు కూడా పనిచేయని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

- వందశాతం సబ్సిడీతో ఆర్థిక చేయూతనందించడంతో పేద మైనార్టీలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పథకాలను రూపొందించి అమలుపరుస్తున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వ పాలనలో రైతులు మొదలుకొని కులవృత్తులు చేపట్టే వారి వరకు అందరి సంక్షేమానికి అనుగుణంగా పథకాలు రూపొందించారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు, ఎంపీపీ జయమ్మ, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్, మస్రత్‌తాజ్‌బాబా, మేకల వెంకటేష్ ముదిరాజ్, అజయ్, రేఖ, విజయలక్ష్మి, లావణ్య, రాణి తదితరులున్నారు.

ఓటుహక్కుపై 5కె రన్

అత్తాపూర్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాల్సిన బాధ్యత ఉందని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ రవికుమార్ అన్నారు. శనివారం ఓటుహక్కుపై 5కె రన్ నిర్వహించారు. డైయిరీ ఫామ్ జంక్షన్ నుంచి రాజేంద్రనగర్ యూనివర్సిటీ గేటు వరకు ఈ రన్ కొనసాగింది. ముఖ్య అతిథిగా ఉప కమిషనర్ హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటరుగా నమోదు చేసుకోని వారు 18 ఏళ్లు నిండిన యువతీయువకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఓటు నమోదు చేయిస్తున్నామన్నారు. ఓటరు లిస్టులో తపొప్పులున్నా.. వాటిని సరి చేసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, నాయకులున్నారు.



5కె రన్‌ను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్

అభివృద్ధి పనుల్లో లోపాలు లేకుండా చూడాలి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్

అత్తాపూర్: అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ అన్నారు. శనివారం అత్తాపూర్ ఓల్డ్ విలేజ్ పోచమ్మ దేవాలయం సమీపంలో డ్రైనేజీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో జాప్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. స్థానికులు డ్రైనేజీ లైన్ సరిగ్గా నిర్వహించడం లేదని తన దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. అభివృద్ధి పనుల్లో లోటుపాట్లు ఉంటే తగిన చర్యలు తప్పవన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరిస్తామని వివరించారు. డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే సీసీరోడ్డు వేయిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. జలమండలి ఏఈ వినాయక్, బీజేపీ నాయకులు సరితారెడ్డి, వెంకటేష్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ



పనులను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 9,10,11వ డివిజన్‌లలో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం బాగుండాలంటే శానిటేషన్ నిర్వహణ బాగుండాలన్నారు. శానిటేషన్ పనులను రోజూ పరిశీలిస్తున్నామని నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి, తడి చెత్తను ఎరువుగా తయారు చేసుకోవాలన్నారు. పొడి చెత్తను రిసైక్లింగ్‌కి పంపి చెత్త రహిత బండ్లగూడ జాగీరుకు సహకరించాలని కోరారు. చెత్తను స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇప్పించేలా చూడాలన్నారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు జగన్, తౌఫిక్, సురేష్ తదితరులున్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్

అత్తాపూర్: సూక్ష్మ క్రిమిద్వారా కుష్టు వ్యాధి సోకుతుందే తప్పా.. వంశపారపర్యంగా రాదని రాష్ట్ర మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, జిల్లా డీపీఎంఓ అధికారి రవీందర్‌రెడ్డిలు తెలిపారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఆగస్టు 31 వరకు ఇంటింటికీ మెడికల్ సిబ్బంది, ఆశావర్కర్లు పర్యవేక్షించి వ్యాధిలో ఉన్న వారిని గుర్తించి ఉచితంగా మందులు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. శరీరంలో వివిధ విభాగాలలో క్రిమి ద్వారా వచ్చే ఈ వ్యాధి మొదటగా మచ్చలుగా ఏర్పడుతుందని ఆ ప్రాంతంలో స్పర్శ ఉండదని వివరించారు. ఇలాంటి సమస్యను గుర్తించి ఆరు నెలల నుంచి ఏడాదిలోపు వ్యాధి నివారణ చేసుకోవచ్చని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా కుష్టువ్యాధిని పోల్చుకుంటే దేశంలో 50 శాతం కేసులు నమోదవుతున్నట్లు వివరించారు. వ్యాధి సోకిన వారిని సమాజం దూరం పెట్టొద్దని మనలో ఒకరిగా గుర్తించి మానసికంగా ధైర్యం ఇవాలని కోరారు. కుష్టు వ్యాధి శరీరంలో నెమ్మదిగా సోకి మూడేళ్ల తర్వాత బయటపడుతుందన్నారు. ప్రారంభదశలో గుర్తించి ఎండీటీ చికిత్స ద్వారా అంగవైకల్యం రాకుండా చూసుకోవచ్చన్నారు. వ్యాధి సోకిందని ఎవరికి వారు కుటుంబసభ్యులకు చెప్పడంతో పాటు డాక్టర్లను సంప్రదించి కుష్టు వ్యాధిని దేశం నుంచి పారదోలేందుకు ప్రతి ఒక్కరూ దీక్షబూనాల్సిన అవసరం ఉందని వివరించారు. విప్రసీ మోడల్ పర్సన్ గౌరీ, ఆశ, పద్మ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



శ్రీరామ్‌నగర్‌కాలనీలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు అభివృద్ధి పనులను చేపడుతున్నామని డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శ్రీరామ్‌నగర్ కాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులు, శాంతినగర్ కాలనీలో వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థ పైపు మరమ్మతు పనులు, బాక్స్‌డ్రైన్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలో నెలకొన్న ప్రజా సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. జోగి రవి, శ్రీకాంత్‌రెడ్డి, చిన్న, జగన్, రామరావు, రవి, ఆదిముల శేఖర్, సీ.హెచ్.ప్రభుదాస్, మహమ్మద్ షకీల్, భాస్కర్, రవి, చందుముదిరాజ్, బాలస్వామి, ఆంజనేయులు, శేఖర్, హెచ్‌ఎండబ్ల్యూఎస్అండ్ఎస్‌బీ సూపర్‌వైజర్ జియ, వినయ్, బస్తీ వాసులు తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ప్రజా సమస్యలను తెలుసుకుని శాశ్వతంగా పరిష్కరిస్తామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ పద్మశ్రీహిల్స్‌లో నూతన డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ.. పద్మశ్రీహిల్స్‌లో నూతన డ్రైనేజీ వ్యవస్థ అవశ్యకతపై ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. డ్రైనేజీ పనులకు మరిన్ని నిధులు మంజూరయ్యేలా చూడాలని ఎమ్మెల్యేను కలిసి విన్నవించామన్నారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బి జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, స్థానిక నాయకుడు పాపయ్యయాదవ్ జలమండలి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఉపకమిషనర్ రవికుమార్‌ను కలిసిన కురుమ సంఘం సభ్యులు

రాజేంద్రనగర్: పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే అనారోగ్యాల బారినపడకుండా ఉంటామని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ అన్నారు. నూతనంగా ఉపకమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను బాబుల్‌రెడ్డినగర్ కాలనీ కురుమ సంఘం అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్ మాట్లాడుతూ.. బాబుల్‌రెడ్డినగర్ కాలనీలోని వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచుకుని తడి, పొడి, చెత్తను వేరు చేసేలా కాలనీ వాసులకు అవగాహన పెంచాలన్నారు. రోడ్ల పక్కన మొక్కలు పెంచే విధంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తామని ఆయన సూచించారు. మాజీ కౌన్సిలర్ శ్రీను, అప్పుకుమార్, స్వామి, మల్లేష్, లక్ష్మణ్, కిష్టప్ప, రామకృష్ణ, లింగం, తిమ్మప్ప, రమేష్, శివ, వేణుగోపాల్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



విశ్వవిద్యాలయంలో ఫొటోగ్రాఫర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఏజీవర్సిటీ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించారు.కళాశాలలోని ఫొటోగ్రఫీ క్లబ్ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు అండర్ స్టాండింగ్ క్లౌడ్స్– నేచర్ త్రూ క్లౌడ్స్ అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన మహమ్మద్‌సాద్, సాయిశ్రీరామ్, గణేష్, అభినయ్, సాయికుమార్, భాస్కర్‌లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ వినియోగంతో వ్యవసాయంలో మేలైన విస్తరణ సేవలు అందించవచ్చన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్‌నాయక్‌ను సన్మానించారు. రిటైర్డ్ సీనియర్ ఫొటోగ్రాఫర్ శివకుమార్, విశ్వవిద్యాలయం అధికారులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ సందర్శన

ఉత్తమ పోలీస్‌స్టేషన్లను ఎంపిక చేసిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌ను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కమిటీ సభ్యులు పరిశీలించారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి వివిధ సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దేశంలోనే బెస్ట్ పోలీస్‌స్టేషన్‌ల ను ఎంపిక చేశారు. ఈ పోలీస్‌స్టేషన్‌లలో ప్రజలకు అందజేస్తున్న సేవలు, పోలీసుల పనితీరు, పోలీస్‌స్టేషన్ ఆవరణలో వాతావరణం తదితర వాటిపై మొదటి రౌండ్‌లో కమిటి సభ్యులు స్వయంగా స్టేషన్‌ను సందర్శించి పరిశీలిస్తున్నారు. సైబరాబాద్ పో లీస్‌స్టేషన్ పరిధిలో కేవలం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ మాత్రమే ఎంపికైంది. తెలంగాణలోనే మూడు పోలీస్‌స్టేషన్‌లు ఎంపిక కాగా.. అందులో రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఉండటం గమనార్హం. మొదట కమిటీ బృందం పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించారు. పార్కింగ్, స్టేషన్ ఆవరణలోని గార్డెన్, సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన వెయింటింగ్ రూమ్, రిసెప్షన్, నోటీస్ బోర్డులను పరిశీలించారు. అనంతరం రిసెప్షన్‌లో వివరాల నమోదును అడిగి తెలుసుకు న్నారు. సాయంత్రం 6 గంటలకు కమిటీ బృందం తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం కమిటీ బృందాన్ని రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, అదనపు డీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు స్వాగతం పలికారు.



రాజేంద్రనగర్ పోలీస్ అధికారులతో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సభ్యులు